క్లుప్తంగా

ఎండీయూ ఆపరేటర్లను నిలువునా ముంచేశారు


నక్క వర్షిణి

రాజాం: రాష్ట్రంలో రేషన్ డోర్ డెలివరీకి సంబంధించిన ఎండీయూ వాహనాల ఆపరేటర్లను కూటమి ప్రభుత్వం నిలువునా ముంచేసిందని వైస్ ఎంపీపీ నక్క వర్షిణి ఆరోపించారు. బొద్దాం గ్రామంలోని తన నివాసంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు ఇవ్వక పోగా ఉన్న ఉద్యోగాలను తీసేస్తోందని, చిరుద్యోగులను రోడ్డుపై ఈడ్చుతోందని విమర్శించారు. ఇంటికో ఉద్యోగమిస్తామని చెప్పి నిరుద్యోగయువతను మోసగించారని మండిపడ్డారు. రేషన్ డోర్ డెలివరీని నిలిపివేయడంతో పాటు ఎండీయూ ఆపరేటర్లను తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ఇచ్చిన జీఓను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సహాయం


నగదు అందజేస్తున్న రియాజ్ ఖాన్

బొబ్బిలి: పట్టణంలోని జామియా మసీదు మాజీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అతనికి వైద్యఖర్చుల నిమిత్తం వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ రియాజ్ ఖాన్ ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఇస్మాయిల్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని అభిలషించారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు


గాయపడిన వారిని 108లో రాజాం తరలిస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధిలోని అరసాడ శ్రీసంతోషిమాత ఆలయం ఆవరణలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. మంగళవారం ఎదురెదురుగా వెళ్తున్న ఆ ఇద్దరు వ్యక్తుల బైక్‌లు ఢీకొనడంతో బూరాడకు చెందిన శంకరరావుకు తలకు గాయాలు కాగా, పోరాంకు చెందిన కుడి కాలికి గాయాలయ్యాయి. 108కు స్థానికులు సమాచారం అందించడంతో ఈఎంటీ విశ్వనాథ్, పైలట్ సాయిబాబా క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

21వ రోజుకు చేరిన సమ్మె


కార్మికులకు మద్దతు తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

రాజాం సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ కార్మికులు చేపడుతున్న సమ్మె మంగళవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. వీరికి యూటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

రేషన్ పంపిణీపై ఫిర్యాదులొస్తే చర్యలు


రేషన్ డీలర్లతో సమావేశమైన అధికారులు

సంతకవిటి: ఇంటి ముంగిటకే వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందించే ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసిందని, ఇక నుంచి రేషన్ సరుకులను డిపోల వద్ద డీలర్లే పంపిణీ చేయాలని సీఎస్‌డీటి చిరంజీవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రేషన్ డీలర్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీపై లబ్ధిదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత డీలర్‌పై చర్యలు తప్పవని అన్నారు. రేషన్ సరుకుల పంపిణీ పారదర్శకంగా, సకాలంలో చేపట్టాలని చెప్పారు. ఈ–పాస్, తూనిక మెషిన్లు పాడైపోతే వెంటనే మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు.తహసీల్దార్ బి.సత్యం, తూనికలు, కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

విస్తరిస్తోన్న ఆయిల్ పామ్ సాగు

- ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై రైతుల ఆసక్తి
- రాజాం నియోజకవర్గంలో క్రమంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- తక్కువ పెట్టుబడితో అధిక లాభం
- నియోజకవర్గ రైతులకు అందుబాటులో ఆయిల్‌మిల్లు


రాజాం మండలంలోని సోపేరులో కొత్తగా వేసిన ఆయిల్ పామ్ మొక్కలు

రాజాం: నియోజకవర్గ రైతులు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలతో పాటు తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో మంచి ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకుంటున్నారు. కొంతకాలంక్రితం నియోజకవర్గంలో డ్రాగన్, తైవాన్ జామ వంటి పండ్ల తోటలు కొత్తగా సాగులోకి రాగా... తాజా గా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. అందుబాటులో ఆయిల్ మిల్లులు ఉండడం, మిల్లు యాజమాన్యమే మొక్కలు పంపిణీ చేస్తుండడంతో రైతులు ఈ పంటను సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

450 ఎకరాల్లో..

ప్రస్తుతం రాజాం నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ తోటలు 450 ఎకరాల్లో సాగులో ఉన్నాయి. ఈ మధ్యకాలంలో వీటి సాగు అధికమైంది. అత్యధికంగా వంగరలో 320 ఎకరాలు, రేగిడిలో 35 ఎకరాలు, రాజాంలో 30 ఎకరాలు, సంతకవిటిలో 20 ఎకరాల మేర రైతులు సాగుచేస్తున్నారు. రైతులకు ఈ మొక్కలను రేగిడి మండలంలోని శ్రీనివాసా ఆయిల్‌మిల్ పంపిణీ చేస్తోంది. ఈ పంటసాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానవనశాఖాధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. నీటి వనరులు, మట్టి సారం పరిశీలించిన అనంతరం ఆ శాఖ అధికారులు మొక్కల నిమిత్తం ఆయిల్‌మిల్లుకు ప్రతిపాదనలు పంపిస్తారు. ఈ అనుమతుల ప్రకారం ఆయిల్ మిల్లు యాజమాన్యం నర్సరీ ల నుంచి మొక్కలు తెప్పించి ఎకరానికి 57 మొక్కలు చొప్పున రాయితీపై అందజేస్తుంది. వీటిని ఉద్యానవనశాఖ అధికారుల సమక్షంలో ట్రై యాంగిల్ విధానంలో పొలంలో నాటాల్సి ఉంది. సకాలంలో పంటకు నీరు అందేలా రైతులు చూసుకోవాలి

నాలుగో ఏడాది నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయం

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తర్వాత మూడో ఏడాది పూతకు వచ్చి, నాలుగో ఏడాది పంట


రేగిడి మండలం ఖండ్యాం సాగులో ఉన్న ఆయిల్ పామ్

కోతకు వస్తుంది. ఏడాదికి ఎకరానికి 8 నుంచి 10 టన్నుల పామాయిల్ పిక్కలు దిగుబడి వస్తుండగా, ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ధర రూ.21 వేల నుంచి రూ.22 వేల వరకు పలుకుతోంది. ఈ ధర ప్రకారమే రేగిడిలోని శ్రీనివాసా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కొనుగోలుచేసి, రైతుకు నగదుచెల్లిస్తోంది. గతంలో కంటే ప్రస్తుతం ఈ పామాయిల్ పిక్కల ధర టన్నుకు రూ.3 వేల మేర పెరిగింది. మొక్కలు నాటిని నాలుగో ఏడాది నుంచి 30 ఏళ్ల వరకూ పెట్టుబడిలేని ఫలసాయాన్ని పొందవచ్చు.

రాయితీపై డ్రిప్ పరికరాలు

ఆయిల్ పామ్ పంట సాగుచేసే రైతులకు ఉద్యానవనశాఖ తోడుగా నిలుస్తోంది. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులకు మైక్రోఇరిగేషన్ పథకంలో భాగంగా రాయితీపై డ్రిప్ పరికరాలు,పైపులు అందజేస్తోంది. అయిదెకరాల లోపు రైతులకు 90 శాతం, అయిదెకరాలు దాటిన రైతులకు 50 శాతం మేర రాయితీతో ఈ పరికరాలు అందిస్తున్నారు. పంటకు డ్రిప్ ద్వారా నీరు అందించడం వల్ల పూత బాగా వస్తుందని, మొక్కలకు నీరు కూడా సమృద్ధిగా అందుతుందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.

మంచి ఆదాయం

ప్రస్తుతం పామాయిల్ పిక్కలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. అందుబాటులో మంచి మొక్కలు కూడా వస్తున్నాయి. రాజాం నియోజకవర్గంలోని రైతులకు రేగిడిలోని శ్రీనివాసా ఆయిల్ పామ్ ఇండస్ట్రీ బాగా సహకరిస్తోంది. రైతులు ఈ పంటలు సాగుచేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందవచ్చును.

– సీహెచ్.ఉమామహేశ్వరి, ఉద్యానవనశాఖ అధికారి, రాజాం

మూడెకరాల్లో సాగు చేస్తున్నాం..

మా బంధువులు వంగర మండలంలో పామాయిల్ తోటలు సాగుచేస్తున్నారు. ఆదాయం బాగుందని చెప్పారు. ప్రస్తుతం చెరకకు డిమాండ్ తగ్గడంతో ఆ పొలంలో పామాయిల్ తోటలు వేశాం. మూడుఎకరాల్లో పంట సాగులో ఉంది.

– ఆర్. నర్సింహమప్పుడు, రైతు, ఖండ్యాం, రేగిడి మండలం

దిగుబడి బాగుంది

ఆరేళ్ల క్రితం పామాయిల్ తోటల సాగు ప్రారంభించాం. గత రెండేళ్లుగా పంటను విక్రయిస్తున్నాం. ప్రస్తుతం పంట దిగుబడి బాగుంది. ఇంత వరకూ ఎటువంటి ఇబ్బందులు రాలేదు. రేగిడి ఫ్యాక్టరీకి పిక్కలు ఇస్తున్నాం. సకాలంలో చెల్లింపులు చేస్తున్నారు. పంటకు నీటి తడులు సకాలంలో అందించడం ద్వారా మంచి దిగుబడి కూడా కనిపిస్తోంది.

–ఎల్. వెంకటరమణ, రైతు, సోపేరు, రాజాం మండలం

కష్టపడే వారికి తగిన గుర్తింపు


రాజేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల కన్వీనర్లు

- డాక్టర్ తలే రాజేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల కన్వీనర్లు

రాజాం: పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంపు ఆఫీస్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల కన్వీనర్లు మంగళవారం ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తమను నమ్మి పలు బాధ్యతలు అప్పగించినందుకు రాజేష్ ద్వారా పార్టీ జాతీయ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకోసం కష్టపడిపనిచేస్తామని, అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, భయపెట్టినా లొంగే ప్రసక్తిలేదని, ప్రజల పక్షాన, పార్టీ పక్షాన నిలబడతామని అన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు, అధికార పార్టీ దాష్టీకాలపై చర్చించారు. పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బూత్ కమిటీ అధ్యక్షుడు బూర్లె నరేష్, మేధావి వర్గం అధ్యక్షుడు కొండాడ శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు బలివాడ నరేంద్ర, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు వై. వాసు నాయుడు, ఐటీ విభాగం అధ్యక్షుడు జి.హేమంత్‌కుమార్, ప్రభాత్‌కుమార్, కెల్ల మన్మధరావు, ఆశపు సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసింది..

- శంబంగిని కలిసిన ఎండీయూ ఆపరేటర్లు


మాజీ ఎమ్మెల్యే శంబంగికి తమ సమస్యలు చెప్పుకుంటున్న ఎండీయూ ఆపరేటర్లు

బొబ్బిలిరూరల్: రేషన్ డోర్ డెలివరీ చేసే తమను రాష్ట్ర ప్రభుత్వం అకస్మాత్తుగా విధుల నుంచి తొలగించి తమ కుటుంబాలను రోడ్డున పడేసిందని మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఎండీయూ ఆపరేటర్లంతా మాజీ ఎమ్మెల్యే శంబంగిని పక్కి గ్రామంలో మంగళవారం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. నాలుగున్నరేళ్లుగా సేవలందిస్తున్న తమకు కూటమి ప్రభుత్వం ఎటువంటి నోటీసులివ్వకుండా రోడ్డును పడేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమకు న్యాయం చేసేలా మద్దతివ్వాలని శంబంగికి విన్నవించుకున్నారు. శంబంగి స్పందిస్తూ ఈ సమస్యను ఈనెల 29న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి వివరిస్తానని, తదుపరి కార్యాచరణపై ఆయన ఆదేశాల మేరకు ఉద్యమించాలని ధైర్యం చెప్పారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ కిరణ్‌కుమార్

రామభద్రపురం: గ్రామాల్లో ప్రజా సమస్యలపై దృష్టి సారించి, వాటిని పరిష్కరించాలని సచివాలయాల సిబ్బందికి డీఎల్‌డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీడీఓ రత్నంతో కలిసి సచివాలయ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో మంగళవారం సమావేశమ య్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు.పారిశుద్ధ్య పనులతో పాటు తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులను తరచూ చేయించాలని, యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో యోగా శిక్షణ తరగతులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణ,ఏపీఓ త్రినాథరావు, ఏపీఎం అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


అలివేలి యోగక్షేమాలను ఉమామహేశ్వరరావును అడిగితెలుసుకుంటున్న డాక్టర్ రాజేష్

రేగిడి: మండల పరిధిలోని లచ్చన్నవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల ఉమామహేశ్వరరావు భార్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అలివేలి అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ మంగళవారం లచ్చన్నవలస గ్రామానికి వెళ్లి పరామర్శించారు. అలివేలి ఆరోగ్యపరిస్థితిపై ఆమె భర్త ఉమామహేశ్వరరావును అడిగితెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, నాయకులు లావేటి గణపతిరావు, లావేటి హరిబాబు, డాక్టర్ బి.నరేంద్ర తదితరులు ఉన్నారు.

ఎదురు చూసి..విసిగి వేసారి

- ఫ్లైఓవర్, రహదారి మరమ్మతులు చేసిన విద్యార్థి సంఘం


గుంతలు పూడ్చుతున్న రవికుమార్ తదితరులు

బొబ్బిలి: రాయగడ రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో కొన్ని నెలలుగా ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారితో పాటు ఫ్లైఓవర్‌పై కూడా గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పలువురు వాహనాలతో పరస్పరం ఢీకొని మరణించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోయినా పట్టణానికి చెందిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.రవికుమార్ స్వయంగా సిమెంట్, రాళ్ల మిశ్రమాన్ని వేసి గుంతలు కప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. రవి తన కార్యవర్గం, ఇతర సంఘం సభ్యులతో కలసి ఫ్లైఓవర్‌పై మరమ్మతులు కొంతైనా చేయడం అభినందనీయమని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

సీసీఆర్‌సీల జారీలో సహకరించాలి


వీఆర్‌ఓలకు సూచనలు చేస్తున్న ఏడీఏ శ్యామ్‌సుందర్

బొబ్బిలిరూరల్: మండలంలో కౌలు రైతులను గుర్తించి వారికి సీసీఆర్‌సీలు (పంట సాగుదారు హక్కు పత్రాలు) అందించే ప్రక్రియలో వీఆర్‌ఓలంతా సహకరించాలని వ్యవసాయశాఖ ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలతో తహసీల్దార్ ఎం.శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కౌలు రైతులను గురించాలని, అలాగే అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి భూముల రికార్డులను వెరిఫికేషన్ చేయాల న్నారు.భూముల ఖాతా నెంబర్లకు ఆధార్ లింక్ కాని వారిని గుర్తించి ఆధార్ లింక్ చేయాలని, పేర్లు తప్పుగా ఉన్న వాటిని సరిచేయాలని చెప్పారు.హెచ్‌డీటీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోండి

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే, రైతులు తమ భూముల ఖాతా నంబర్లకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చాలా మంది రైతుల భూముల ఖాతాలకు ఆధార్ నంబర్లు అనుసంధానం కాలేదన్నారు. ఆధార్ అనుసంధానం చేసుకోని రైతులంతా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ అనుసంధానం చేసుకోకపోతే అన్నదాత సుఖీభవ పథకం వర్తించదని చెప్పారు.

సమావేశాలు నిర్వహించుకోవాలి

రేగిడి: డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకోవాలని ఏపీఎం బి.గోవిందరావు సూచించారు. మండలంలోని ఉంగరాడ, ఆమదాలవలస, రేగిడి గ్రామా ల్లో స్వయం శక్తి సంఘాల్లోని మహిళలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ సంఘాల అభివృద్ధికి ఎప్పటికప్పుడు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. బ్యాంకులకు క్రమం తప్పకుండా రుణాలు చెల్లించాలని సూచించారు.

నేటి నుంచి కౌలు రైతుల గుర్తింపు సభలు

బాడంగి: మండలంలో కౌలురైతుల గుర్తింపు సభలు బుధవారం నుంచి జూన్ 2వ తేదీవరకు రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఏఓ కె.శిరీష తెలిపారు. సభలకు సంబంధించిన షెడ్యూల్‌ను స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె విడుదల చేశారు. ఈనెల 28వ తేదీ ఉదయం రేజేరు, ఆనవరం,మధ్యాహ్నం డొంకినవలస, లెంటువలస, 29న ఉదయం వాడాడ, కోటిపల్లి, మధ్యాహ్నం వీరసాగరం, 30న ఉదయం పాల్తేరు, బొత్సవానివలస, మధ్యాహ్నం ముగడ, భీమవరం, 31న ఉదయం గూడెపువలస,మధ్యాహ్నం గొల్లాది, గజరాయునివలస, జూన్2వ తేదీన ఉదయం బాడంగి, మధ్యాహ్నం కోడూరులో సభలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. కౌలురైతులు ఈ సభలకు హాజరై తమ వివరాలను నమోదు చేసుకుంటే సీసీఆర్‌సీ (పంట సాగుదారు హక్కు పత్రం)లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

పాలిథిన్ నిషేధమే అభిమతం


పంపిణీ చేసిన గుడ్డసంచులను చూపిస్తున్న స్థానికులు

రాజాం సిటీ: పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పాలిథిన్ నిషేధమే ప్రతీ ఒక్కరి అభిమతం కావాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు అన్నారు. రాజాంలోని కల్కి ట్రేడర్స్ యజమాని సమకూర్చిన 600 గుడ్డ సంచులను పట్టణంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చేటప్పుడు చేతి సంచి పట్టుకుని రావాలని, పాలిథిన్‌ను అరికట్టేందుకు కృషిచేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ మనచేతుల్లోనే ఉందని, భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని అన్నారు. పొట్నూ సత్యనారాయణ గుప్త, పెంకి చైతన్య, వాకచర్ల పైడిరాజు, ఆల్తి మోహనరావు, డోల వాసు, ఏ.బాలమురళి, పొదిలాపు శ్రీను పాల్గొన్నారు.

విచారణ వాయిదా

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో పొదుపు సంఘాల నిధుల దుర్వినియోగంపై వెలుగు అధికారులు మంగళవారం చేపట్టిన విచారణలో గందరగోళం నెలకొంది. గ్రామంలోని 108 డ్వాక్రా సంఘాల పొదుపు సొమ్ము, రుణాల చెల్లింపుల్లో వీఓఏ పాత్రపై విచారణకు ఉన్నతాధికారులు ఇటీవల ఆదేశించారు. ఈనేపథ్యంలో చేపట్టిన విచారణకు మంగళవారం రెండు సంఘాల మహిళలు హాజరు కావాల్సి ఉంది. అయితే విచారణకు సంఘ సభ్యులతో పాటు తామూ సైతం హాజరవుతామని, అప్పుడే ఆడిట్ చేయాలని వారి కుటుంబ సభ్యులుపట్టుబట్టారు. పొదుపు సంఘాల సభ్యులు మాత్రమే రావాలని ఏపీఓ భాగ్యలక్ష్మి వారికి ఎంత చెప్పినా వినకపోవడంతో విచారణ అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఓ వర్గం వారు సభ్యులు మాత్రమే హాజరు కావాలని, మరో వర్గం వారు మగవారు సైతం విచారణకు వస్తారని పట్టుబట్టడంతో గందగోళంగా మారింది. దీంతో విచారణను అధికారులు వాయిదా వేశారు.పలు మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

నిత్య యోగా సాధనతో ఆరోగ్యం


ఃబాడంగి: బాడంగి హైస్కూల్ మైదానంలో యోగా చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది

నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు యోగా గురువులు, అధికారులు అన్నారు. యోగాంధ్ర కార్యక్ర మంలో భాగంగా రాజాం, వంగర,బాడంగి, మెంటాడ, రామభద్రపురం, బొబ్బిలి మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాలు, ఉన్నత పాఠశాలల మైదానాల్లో ఆయా మండలాల అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, వైద్యారోగ్య శాఖ, సచివాలయాల సిబ్బందికి మంగవారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. అలాగే యోగాపై అవగాహన ర్యాలీలు చేశారు. ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ఎంఈఓలు, వైద్యాధికారులు, పోలీస్, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


బొబ్బిలి రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో యోగా చేస్తున్న సచివాలయ సిబ్బంది


రామభద్రపురం: మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న అధికారులు,వివిధశాఖల సిబ్బంది


రేగిడి: ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో యోగా శిక్షణ తరగతులకు హాజరైన ఉద్యోగులు


మెంటాడ: మెంటాడలో యోగా శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ భానుమూర్తి


వంగర: ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ


బాడంగి: బాడంగి మెయిన్ రోడ్డులో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు


బొబ్బిలి: బొబ్బిలిలో మున్సిపాలిటీ పరిధి ఉద్యోగులకు యోగాపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీలు


రాజాం సిటీ: యోగా ఆవశ్యకతను వివరిస్తున్న వికాసతరంగిణి సభ్యులు